
# గజరాజు గాధ

అంతులేని చీకటి ఆ నల్లటి కొండరాళ్ళపై భయంకరంగా కప్పుకొంది. ఆకాశంలోని మెరుపులు, మిణుగురు పురుగుల కాంతి తప్ప మిగిలినదంతా గాఢాంధకారం. ఏవో చిన్న చిన్న కూతలు అప్పుడప్పుడూ ప్రతిధ్వనిస్తూ, ఆ నిశ్శబ్దవాతావరణాన్ని మరీ భీభత్సం చేస్తున్నాయి. అతడా నిశీథిలో చేతులతో తడుముకుంటూ తూల్తూ పోతున్నాడు. అకస్మాత్తుగా అతని చేతులకు మరో రెండు చల్లని చేతులు తగిలినాయ్. అతని ఒళ్ళు జల్దరించింది. అతను చేతులతో ఇంకా తడిమాడు. చాపబడియున్న విశాలమైన బాహువులు, గుండ్రని ముఖం, ఆకర్ణాంత పర్యంతమున్న పెద్ద కళ్ళు, తీర్చిదిద్దినట్లున్న కొనదేరిన ముక్కు, కొద్దిగా తెరువబడి యున్న పల్చటి పెదవులు, బిగువుగానున్న ఎత్తయిన వక్షద్వయం. సన్నని నడుము, నున్నటి శరీరము అతని వణుకుతున్న వ్రేళ్ళకు తగిలాయి. ఈ కటికి చీకటిలో నిర్మానుష్యమైన, ఈ భయంకర ప్రదేశములో వస్త్రము లేకుండా నున్న ఇది స్త్రీయా లేక దయ్యమా? అతడు భరించలేని భయంతో 'ఎవరు నీవని' గట్టిగా అరచాడు. సమాధానం అంతకంటే గట్టిగ 'ఎవరు నీవని' ప్రతిధ్వనించింది. అతని నవ నాడులు జిగుసుకు పోతున్నాయ్. అమాంతం అతడు క్రింద కూలబడ్డాడు.

అది ప్రాతః కాల సమయం. బాల భానుని పచ్చని కిరణాలు ఆ కొండ రాళ్ళమీద విచ్చుక పడుతున్నాయ్. కొండ జాజులు, అడవి మల్లెలు వికసించి ఘుమ్మని వాసన కొడుతున్నాయ్. ఆ బాటసారి తడుముకుంటూ భారంగా లేచి చూచాడు. అతని చేతులు రెండు కాళ్ళను పట్టుకొని ఉన్నాయ్. ఆ కాళ్ళు ఎవరివా అనుకుంటూ నెమ్మదిగా పైకి చూడ సాగాడు. ఎత్తు పల్లాలతో నున్న అమ్మదుమైన నగ్న దేహాన్ని చూసేటప్పటికి అతని శరీరము పులకరించింది. కళ్ళు చెదిరే కళా కాంతులతో హృదయాన్ని ఉర్రూత లూపే శిల్ప సుందరీలు చుట్టూ నాట్యం చేస్తున్నారు. తనముందొక సుందరాంగి మూర్తి బాహువులను విశాలంగా చాచి ఆహ్వానిస్తోంది. ప్రాతఃకాల కాంతి ఆమె



## నేబుల్ దేవదాన్

దిగంబర శరీరముపై బడి మెరుస్తోంది. ఆ బాటసారి విశ్చేష్టుడయ్యాడు. ఆమె అవయవ సొంపు ఆపాద మస్తకం చూశాడు. ఆమె చిరునవ్వు నవ్వుతోంది. తాను రాత్రి తడివింది ఒక శిల్ప సుందరివా యని ఆశ్చర్య పడ్డాడు. ఆ చుట్టూ జీవం ఉట్టిపడుతూ ఎన్నో భంగిమలలో నృత్యాలు సలుపుతున్న శిల్ప సుందరీలు అతన్ని వివశుణ్ణి చేశాయ్.


"ఇదంతా మానవ నిర్మితమా?" అన్నాడా బాటసారి.

ఆ దారిన పోతున్న ఆంధ్రుడొకడు అది విని అతన్ని వింతగా చూచాడు. అతని పాలిపోయిన ముఖం, నెత్తిన టోపీ, పొడుగు లాగూ, ఇవన్నిటి బట్టి అతడు విదేశీయుడని ఇట్టే గ్రహించి "ఇదంతా గజరాజనే బాలశిల్పి నిర్మించాడయ్యా. ఇందులో ఆశ్చర్యం లేదు" అన్నాడు ఆంధ్రుడు.

"నేను ఇటలీ దేశస్తుణ్ణి. నా పేరు మార్కోపోలో. హిందూదేశ వింతల్ని చూస్తూ రాత్రే ఇక్కడకు చేరుకున్నాను. ఆ శిల్ప కారుడు ఎక్కడున్నాడో చెప్పు బాబూ చూచి పూజిస్తా" అన్నాడు మార్కోపోలో.

"ఇపుడు ఆ గజరాజనే శిల్పి లేడు. అదంతా ఓ పెద్ద కథలే" అన్నాడు ఆంధ్రుడు. మార్కోపోలో కుతూహలం చెలరేగింది. ఆతృతతో ఆ గాథను చెప్పమని ప్రాధేయపడినాడు.

"ఓ పరదేశీ! ఈ కళా ఖండమైన శిల్ప సౌందర్యంతో ఎంత తేలి పోతున్నావో ఆ కథ వింటే అంత కృంగి పోతావ్. ఈ మంటిలో కలిశాయి ఎన్నో ప్రణయ జీవాలు. ఈ అణువు లొకప్పుడు జీవమయాలు. ప్రేయసిపై అల్లిన కవనాలను, ప్రేయసిని తలపిన తలపులు, ప్రేయసిని తడవిన చేతులు, ఆమెతో మాట్లాడిన మృదువైన పెదవులు. ఈ ప్రదేశాన్ని ఆంధ్ర సామ్రాజ్యంలోని పాలంపేట అంటారు. ఇక్కడకు ఓరుగల్లు నలభై మైళ్ళ దూరంలో ఉన్నది. ప్రస్తుతం ఈ దేశాన్ని కాకతీయ వంశీయురాలైన రాణి రుద్రమదేవి పాలిస్తోంది. ఈమె తండ్రి గణపతి దేవుడు. గొప్ప కళారాధకుడు. పదిహేను సంవత్సరములకు పూర్వము ఈ కొండ ప్రదేశాన్ని గొప్ప శిల్ప కళా ఖండంగా తయారు చేయాలని ప్రపంచమంతా గాలించాడు. అతనికి పందొమ్మిది సంవత్సరాల గజరాజు సమర్థుడని గజరాజు వలన తన ఆశయం నెరవేరునని గజరాజును నియమించాడు. గజరాజు సంతోషముతో అంగీకరించి పని ప్రారంభించాడు. అతని సుకుమార హస్తములతో ఉలి కఠిన శిలను అందమైన మూర్తులుగను, నల్ల కొండలను సుందరమైన మందిరములుగను దొలచుకుంటూ వయ్యారంగా పరుగెత్త సాగింది. బాలశిల్పి ఖ్యాతి నలుమూలలా వ్యాపించింది చూడటానికి ప్రజలు తీర్థయాత్రగా రాసాగరు. అప్పటికి రాకుమారికి పదిహేడు సంవత్సరముల ప్రాయము. రాకుమారి రుద్రమదేవికూడా ఒకనాడు వెళ్ళి గజరాజు శిల్ప సృష్టి చూచి తన్మయురాలైంది. ఆ దినమే గజరాజు ఆ జగదేకసుందరి రాకుమారి అని తెలియక గాఢంగా ప్రేమించాడు. ఆమెనే ఆరాధ్య దైవముగా పెట్టుకొని ఆమె తిరిగి వచ్చి తనలో వెలిగిన ప్రేమజ్యోతిని



ప్రకాశవంతం చేస్తుందనే ఆశతో ఉత్సాహంగా తన శిల్ప నైపుణ్యాన్ని వ్యాపింపజేస్తున్నాడు. తన శిల్పాలయందు ఆమె ఆకారమును సృష్టించుచున్నాడు.

కొన్ని సంవత్సరాలు గడిచాయి. ధర్మ ప్రభువు శ్రీ గణపతి దేవులు మరణించారు. ఆయన పుత్రిక రుద్రమ దేవి సింహాసనాన్ని అధిష్టించింది. ఆడది పాలించడమేమిటని శత్రువులు, రాజద్రోహులు దేశంలో కల్లోలం లేవనెత్తారు. ఆడది అబల కాదనీ ఆడ సింహమనీ బుజువు పర్చింది రుద్రమ దేవి. శత్రువులను ఓడించి రాజ్యాన్ని విస్తరింపజేసింది. ఇట్లా దేశ శాంతికి పాటు పడుతూ శిల్పిని మరిచింది. ఒకనాడు అమాత్యుడు శిల్పి గజరాజును రాణికి జ్ఞాపకం చేశాడు. ఆమె ఆమరువాడే పాలంపేట శిల్పివద్దకు చూడడాన్కివెళ్ళింది. ఆ ప్రాంతంలో కలిగిన మార్పుకు ఆమె చకితురాలైంది. పూర్వమున్న రాళ్ళలో నేడు ఆమెకు జీవ స్వరూపములు కన్పించినవి. శిల్పి గజరాజును నోరార ప్రశంసించినది. గజరాజకు ఆమెను గాంచుట తోడనే అతని లోని ఆశలు రేగి మనస్సు వూయలలూగసాగినది. ఆమె మహారాణి యని తెలియక తన నిష్కల్మషమైన ప్రేమను హృదయావేదనను తెలియపర్చాడు. రాణి గజరాజును తేరపారచూచినది. అతని శిల్ప చాతుర్యమే కాక అతని సౌందర్య బుద్ధికుశలతలు ఆమెను బాగుగా ఆకర్షించినాయ్. ఆమె అతని ప్రేమను తృణీకరించలేక పోయింది. సమయమున్నప్పుడెల్లా అతన్ని కలిసికొంటాన్కి వెళ్ళేది. వారిరువురి ప్రేమగాఢముగ మనస్సులందు అల్లుకొని పోయినది. విడిపోలేని బంధం వారి హృదయాల మధ్య బిగుసుకు పోయింది. ఆ ప్రేమలో రాణి మంచం పట్టింది. రేయింబవళ్ళు గజరాజు గూర్చి ఆమెకే కలవాట్లు పలుకుతోంది. ఆది విన్న మంత్రి గజరాజుకొరకై కబురు పంపాడు. గజరాజు వచ్చాడు. గజరాజును చూచిన తరువాత రాణి రుద్రమ దేవి బాధ తగ్గినది. "రాజా! మన అనురాగాలు దూరం కావేరవు. నేను మహారాణినైనా నీ హృదయేశ్వరినే. నా కోర్కె ప్రధానులు, ప్రజలు కాదనరు. నీవు మా తండ్రి నియమించిన ప్రకారం శిల్పఖండాన్ని పూర్తిచేసేయ్. నేను మన వివాహానికై తగిన ఏర్పాట్లు చేస్తాను" అని గజరాజుతో రుద్రమ చెప్పింది. గజరాజు హృదయం బరువెక్కింది. ఆమె కాకతీయ సామ్రాజ్యాన్నిపాలించే మహారాణి అని తెలిసి కృంగిపోయాడు. తాను ఏ ప్రాణేశ్వరి నైతే మనస్సునందుంచుకొని ఆ శిల్పాలు తయారు చేసాడో ఆ మూర్తులముందు నిల్చొని "ఓ చెలి బాధ తెలిసికోనా" అంటూ శోకగీతాలు ఆలపించాడు.

సామ్రాజ్యాన్ని పాలిస్తూ ప్రజలచే మన్ననలు బడసి శాంతిచేకూర్చవలసిన ఒక మహారాణికి తాను పతియగుట వల్ల కలిగే అభిప్రాయాల్ని ఆలోచించాడు. ఆమెతో తనకు వివాహం అసంభవమనుకున్నాడు. ఆమె ప్రకాశవంతమైన కీర్తికి తానొక మచ్చనగుదునని బాధ పడినాడు. ఆమె యొక్క కీర్తికి తాను అడ్డు తొలగి తన స్వచ్ఛమైన ప్రేమను త్యాగం చేయడానికి-నిశ్చయించుకున్నాడు. వికసించడాన్కి సిద్ధమైన మొగ్గను త్రుంచుటకు తీర్మానించుకున్నాడు.

గణపతిదేవుల ఆత్మశాంతికై మిగిలిపోయిన పనిని నిద్రాహారములు మాని రాత్రింబవళ్ళు శ్రమించి ఆ ప్రదేశాన్నంతా సర్వశోభాయమానంగా తయారు చేశాడు. అతని ఆరోగ్యం నిద్రాహారములు లేకుండా పనిచేసినందున సర్వనాశనమైంది. పనంతా పూర్తి చేసి ఒక్కొక్కటే తిరిగి చూడసాగాడు. తను మనసార నిర్మించిన ఈ శిల్ప సుందరి ముందు నిల్చొని ఏవో ప్రణయాలాపాలు చేశాడు. అతని శిల్పకళానైపుణ్యం అతనికి విభ్రాంతుని జేసింది. అతడు ఆనందంతో తన పని పూర్తి అయినందులకు ఉప్పొంగి పోయాడు. ఆలయ శిఖరం పైకెక్కిచుట్టు రమ్యముగనున్న శృంగార దృశ్యాల్ని తిలకించాడు. తన పనిని ముగించినానని గణపతిదేవుని జ్ఞప్తితెచ్చుకొనినాడు. గణపతిదేవుడు తన్ను పూలహారంతో సత్కరించడాన్కి ఆహ్వానించుచున్నాడని భ్రమించిశిఖరం పైనుండి పడిపోయాడు. సరిగ్గా ఆ సమయానికి గజరాజును ఓరుగల్లు వివాహానికి తీసికొనివెళ్ళడానికి రుద్రమ సపరివారంగా వచ్చింది. గజరాజును జూచి గొల్లున ఏడ్చింది. అతని శరీరాన్ని ఒడిలో తీసికొని "రాజా! నిన్ను తీసికొని వెళ్ళడాన్కి వచ్చాను. ప్రజలు మంత్రులు మన వివాహానికి సమ్మతించారు" అన్నది. గజరాజు చిరునగవుతో కళ్ళు తెరిచి తన శిల్పనిర్మాణాన్ని ఆమెకు చూపి ఆమె కళ్లలోకి చూస్తూ తన కళ్ళవెంబడి నీరుగార్చి ఆమె వక్షస్థలంపై శాశ్వతంగా కన్నుమూసాడు. రాణిరుద్రమ దుఃఖానికి అవధిలేదు. గజరాజు ఆమె హృదయంలో అనంతమైన స్థానాన్ని ఆక్రమించాడు. ఈరేణువులే నిండుప్రేమతో పండైన హృదయం రాల్చిన బాష్పకణాలు. ఇదే ఆవేదనతో అలమటిల్లిన రెండు హృదయాల విషాదగాథ. ఇదే అప్రణయగాథ".

మార్కోపోలో కళ్ళు నీళ్లతోనిండి ఎదురుగనున్న శిలాసుందరి అనేక రూపాల్లో కన్పించింది. ఆప్రదేశానికంతకుహృదయపూర్వకమైన జోహారు లర్పించాడు.

రాజదర్బారులో సింహాసనాసీనురాలై ఠీవి ఒలికిస్తోంది రాణీరుద్రమ. మార్కోపోలో దర్బారు అందాన్ని ఆనందిస్తూ ప్రవేశించాడు. సింహాసనముపై కూర్చున్న దివ్యసుందరి రాణి రుద్రమదేవిని చూచి కొద్దిక్షణాలు ప్రాన్పడిపోయాడు. గజరాజు నిర్మించిన శిల్పసుందరే ఈభంగిమలో సింహాసనముపై అధిష్ఠించినట్లు భ్రమించాడు. తరువాత ఆమె ఆహ్వానము విని సవినయంగా వంగి నమస్కరించి పరిచయం చేసికున్నాడు. మార్కోపోలో ఆంధ్రదేశ సంపదను పొగుడుతూ శిల్పకళానైపుణ్యాన్ని ఎత్తి పాలంపేట గజరాజు శిల్పఖండాన్ని గూర్చి అత్యద్భుతంగా మెచ్చుకున్నాడు. "కళ్ళుదేన్నయితే నమ్మలేవో మనస్సు దేన్నయితే వూహించలేదో అటువంటి ఉత్తమోత్తమ శిల్పకళాఖండాన్ని చూచాను. ఆంధ్రశిల్పాలకు ఈభువిపై సాటి లేదు" అన్నాడు.

రుద్రమకళ్ళు అశ్రుపూరితములైనవి. గజరాజు ఆమె మనస్సులో మెదిలాడు. ఆమెహృదయం ఆక్రోశించింది. పెల్లుబికి వచ్చుచున్న బాధనణచుకొనలేక మహామంత్రికి మార్కోపోలోను సత్కరించమని చెప్పి అంతఃపురానికి నిష్క్రమించింది.

నేను వరంగల్ వెళ్ళినపుడు నాడు మార్కోపోలో చూచిన శిలాసుందరిని చూస్తూ ఈ కథనంతా జ్ఞాపకం చేసికున్నా. నాహృదయం బరువెక్కి అప్రయత్నంగా నాకన్నుల వెంబడి కూడా బాష్పములు జలజల రాలసాగినయ్. శిలాసుందరి ఎన్నో రూపములతో నీళ్ళతో నిండిన నాకళ్లకు కన్పించింది. నాకళ్ళు మూసుకుని ఏదో ఆలోచిస్తూ నా బాహువులను కూడా చూచాను. నా వ్రేళ్ళకు మెత్తని మెదులుతున్న అవయవాలు తగిలేటప్పటిక్ శరీరం గగుర్పొడ్చి కెవ్వున అరచాను. అమాంతంగా నేను పట్టుకున్న సుందరమూర్తితోసహా క్రింద తూలిపడ్డాను. కళ్ళు తెరిచి చూచేటప్పటికి మా యూన్నీరాణి మంచం మీదనుంచి క్రిందపడ్డ నన్నుచూచి పకపకా నవ్వుతోంది. 'ఇదంతా ఒక కలా!" అని దులుపుకుంటూ లేచి "ప్రొద్దున్నే ఈశిలాహృదయాన్ని చూచానేరా భగవంతుడా! ఈరోజు ఎట్లా గడుస్తుందో" అనుకున్నాను.